

ఉష్ణోగ్రత (అంచనా)

10-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	25
బాపట్ల	38	27
రెంటచింతల	41	26
చీరాల	38	27

పరిశ్రమలతో యువతకు ఉపాధి

- పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- ఎంఎస్ఎంఈ శంకు స్థాపనలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

బొల్లాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతో యువతకు స్థానికంగానే పెద్దఎత్తున ఉపాధి లభిస్తోందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. బొల్లాపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కుకు శుక్రవారం భూమి పూజ, శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లాపల్లి ప్రాంత అభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కు ఎంతగానో దోహద పడుతుందని, యువతకు ఉపాధి అవకా శాలు మెరుగవుతాయన్నారు. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహక రిస్తుందన్నారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈ రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా.. మదార్‌సాహెబ్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న కౌన్సిల్ సభ్యులు
- మైనార్టీల సంక్షేమమే శిరోధార్యమన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- రూ.12 కోట్ల అప్పులో పది నెలల్లో రూ.9 కోట్లు తీర్చాం



మదార్‌సాహెబ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా షేక్ మదార్‌సాహెబ్ ఎన్నికయ్యారు. పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ మదార్‌సాహెబ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఇన్ చార్జి చైర్మన్‌గా ఉన్న పోలూరి నరసింహారావు ఇటీవల రాజీనామాతో తాజాగా ఎన్నిక చేపట్టారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో వైస్ చైర్మన్‌గా ఉన్న మదార్‌సాహెబ్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమమే టీడీపీకి శిరోధార్యమని తెలిపారు. మాచర్ల మున్సిపాలిటీకి ఘన చరిత్ర ఉందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు ముస్లింలను, ముగ్గురు వైశ్యులను చైర్మన్లుగా ఎన్నుకున్న ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో మదార్‌ను చైర్మన్ చేస్తానని హామీ ఇచ్చానని, అందుకు కట్టుబడి చైర్మన్‌గా అవకాశం కల్పించినట్లు చెప్పారు. వైసీపీ హయాంలో మున్సిపాలిటీకి రూ.12 కోట్ల అప్పులు ఉండగా గడిచిన పది నెలల్లో దాదాపు 9 కోట్లు తీర్చామన్నారు. పట్టణంలో రూ.3 కోట్లతో రోడ్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుబాబు, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

స్థానికత.. సందిగ్ధం

- 2024లో దరఖాస్తు చేసుకున్న వారికే సర్టిఫికెట్లు
- గత ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతున్న అధికారులు
- రెవెన్యూ అధికారుల తీరుతో డీఎస్సీ అభ్యర్థులకు కష్టాలు

గుంటూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన షేక్ ఫర్హానా యాస్మిన్ కుటుంబం 2015 వరకు హైదరాబాద్‌లో ఉంది. ఆ తర్వాత వారు తిరిగి గుంటూరు వచ్చారు. యాస్మిన్ గుంటూరులోనే చదువుకున్నారు. ఆమె ప్రస్తుతం డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్థానికత సర్టిఫికెట్ కోసం దర ఖాస్తు చేసుకోగా జగన్ ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతూ నిరాకరిస్తున్నారు.

..ఇదే పరిస్థితి అనేకమంది డీఎస్సీ అభ్యర్థులకు ఎదురవుతుంది. రెవెన్యూ అధికారుల సమాధానాలతో వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చిన వారికి రెవెన్యూ అధికారులు సినిమా చూపిస్తున్నారు. స్థానికత అంశాన్ని తేల్చకుండా ఇబ్బందులు పెడుతున్నారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే పొందే స్థానికత సర్టిఫికెట్ కోసం 2024లో దరఖాస్తు చేసుకుని ఉంటే ఇచ్చే వాళ్లమని ఇప్పుడు చెబుతున్నారు. స్థానికత అంశంపై గెజిట్ నోటిఫికేషన్, జీవో 133ని రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కడం ప్రస్తుతం వివాదాస్పదమౌతుంది. ఈ జీవోను పలు మండలాల్లోని రెవెన్యూ అధికారులు పక్కన పెట్టేస్తున్నారు. 2024 జూన్ 1లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్ ఇస్తామని చెబుతున్నారు. గత ప్రభుత్వం అందుకు అనుగుణంగా సర్క్యులర్ జారీ చేసిందని అధికారులు వాదిస్తున్నారు. అయితే 2024 జూన్ 1 లోపు మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం ఎక్కడా ప్రకటన చేయలేదని పలువురు చెప్తున్నారు. ఒకవేళ అలాంటి జీవో ఉంటే లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులతో ముడిపడి ఉన్న ఈ విషయంలో పెద్దగా ప్రచారం కూడా చెయ్యలేదు. ఫలితంగా ప్రస్తుతం వెలువడిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న చాలా మంది అభ్యర్థులు స్థానికత రెవెన్యూ అధికారుల సమాధానాలతో ఏమి చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ గత ప్రభుత్వం అప్పట్లో బహిరంగ ప్రక టన చేసి ఉంటే సర్టిఫికెట్లు పొందే వారమని పలువురు చెప్తున్నారు. ఇప్పుడు పిల్లల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన తర్వాత సర్క్యు లర్ గురించి ఇప్పుడు అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో జోక్యం చేసుకుని గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



జీవో 133 ఏమి చెబుతుందంటే..

2014లో రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం కొన్ని కీలక అంశాలపై ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. 2016 జూన్ 13న వెలువరించిన జీవో 133 కూడా అటువంటిదే. ఈ జీవో ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన తేదీ నుంచి మూడేళ్ల కాలంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారిని మాత్రమే ఆయా జిల్లాల్లో స్థానికులుగా పరిగణలోకి తీసుకోవాలి. ఆ తర్వాత ఆ గడువును ప్రభుత్వం రెండు సార్లు మార్చింది. తెలంగాణ నుంచి ఆయా జిల్లాలకు వచ్చిన వారికి జీవో 133 ప్రకారం వారిని స్థానికులుగా గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేయాలి.

బోధకులు లేక బాధలు

- 80 ప్రొఫెసర్ పోస్టులకు 71 ఖాళీ
- నరసరావుపేట జేఎన్టీయూలో అతిథులే దిక్కు
- 2018 నుంచి నియామకాలపై వర్సిటీ పెద్దల నిర్లక్ష్యం
- బోధన సాగక.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లేక విద్యార్థుల అవస్థలు

ఐదు బ్రాంచ్‌లు.. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న నరసరావుపేట జేఎన్టీయూ (కే) కళాశాలలో బోధకులు లేరు. 80 మంది ప్రొఫెసర్లకు 71 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తొమ్మిది మంది ప్రొఫెసర్లకు ఇద్దరే ఉన్నారంటే ఏమేరకు ఇక్కడ విద్యా బోధన జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బోధకులు లేక.. విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు ఇప్పటికీ అధ్యాపకులను వర్సిటీ నియ మించలేదంటే కళాశాలపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుసుకోవచ్చు. ఏళ్లుగా అతిథి అధ్యాపకులతోనే సరిపెడుతున్నారు. నరసరావుపేట సమీపంలో జేఎన్‌టీయూను 2016లో ప్రారంభించిన కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్టీయూ తీవ్ర నిర్లక్షాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలున్నాయి. పోస్టుల భర్తీతో పాటు ఇతర అనేక సమస్యలతో కళాశాలలో విద్యార్థులు బాధలు పడుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు స్థాపించిన కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్న వారు	ఖాళీ
ప్రొఫెసర్	9	2	7
అసోసియేట్లు	18	1	17
అసిస్టెంట్లు	53	6	47

ప్రాంగణ ఎంపికలు ఇలా..

సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	153
2025	72

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జేఎన్టీయూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. ఇక్కడ సీటు కోసం విద్యార్థులు పోటీ పడుతుంటారు. అత్యుత్తమ బోధన.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లే ఇందుకు కారణం. కానీ నరసరావుపేటలోని జేఎన్టీయూలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ సీటు వస్తున్నా వద్దని విద్యార్థులు వేరే దగ్గరకు వెళ్లిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయినా లోటుపాట్లను సవరించి ప్రతిష్ఠను మెరుగుపరచాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నరసరావుపేటలోని కళాశాలలో వసతుల మాట ఎలా ఉన్నా విద్యా బోధనకు గ్రహణం పట్టింది. పర్మినెంట్ అధ్యాపకులు తొమ్మిది మంది మాత్రమే ఉండగా వారిలో ఒకరు ప్రిన్సిపాల్. మొత్తం 71 మంది అధ్యాపకుల కొరత ఉంది. 22 మంది కాంట్రాక్టు, 18 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో పనిచేసే వారిని నామమాత్రంగా నియమించారు. అధ్యాపకుల నియామకంలో వర్సిటీ వ్యవహరిస్తున్న తీరు దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలపై వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న ఆరోపణలకు ఇక్కడ నెలకొన్న పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అటు పాలకులు.. ఇటు జేఎన్టీయూ కాకినాడ వర్సిటీ అధికారులు కళాశాల నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు నిధులు.. విద్యార్థులకు అవసరమైన వసతులు.. అధ్యాపకుల కొరతను వర్సిటీ పట్టించుకోకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని పలువురు మండిపడుతున్నారు. బోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశాలను నిర్వీర్యం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ఎంపికే ఇందుకు ఆధారం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లను నియమించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఆలోచన వర్సిటీ పెద్దల్లో లోపించింది.




నరసరావుపేట జెన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

యార్డుకు.. 1.08 కోట్ల టిక్కీలు

- మొత్తం 43.59 లక్షల క్వింటాళ్ల విక్రయం
- ఈ ఏడాదికి ముగిసిన మిర్చి క్రయ విక్రయాల సీజన్

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదికి మిర్చి క్రయవిక్రయాల సీజన్ ముగిసింది. గత ఏడాది డిసెంబరు 1న ప్రారంభమైన సీజన్ శుక్రవారం సాయంత్రంతో ముగియగా ఈ ఐదు నెలల వ్యవధిలో యార్డులో మొత్తంగా కోటి 8 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు రాగా వాటిలో 43.59 లక్షల క్వింటాళ్ల మిర్చి ఉన్నట్లు లెక్కించారు. మార్కెట్ ఫీజు రూపంలో ఎంత ఆదాయం సమకూరిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. గుంటూరు, పల్నాడు, కర్నూలు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో రైతులు మిర్చిని విక్రయానికి తీసుకొస్తారు. కొత్తగా అనేక మార్కెట్ కమిటీలు వచ్చినా రైతులు మాత్రం గుంటూరు ఏఎంసీకే ప్రాధాన్యం ఇస్తారు. ముందస్తుగా రుణాలు ఇవ్వడంతో పాటు యార్డుకు సరుకు తీసుకురాగానే రెండు రోజుల్లో అమ్మేసి మొత్తం పైకం మూడు,నాలుగు రోజుల్లోనే వ్యాపారులు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఇక్కడకు వస్తారు. ఈ కారణంగా ధర తగ్గినా రైతులు మాత్రం ఇక్కడికి రాక మానుకోరు. డిసెంబరు జనవరి నెలల్లో 11 లక్షల నుంచి 15 లక్షల టిక్కీల వరకు రాగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో సగటున నెలకు 25 లక్షల మిర్చి టిక్కీలకు పైగా వచ్చాయి. ధర తగ్గడం మూలంగా మిర్చి యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో దాదాపుగా రూ. 15 కోట్లకు పైగా ఆదాయాన్ని కోల్పోయింది.



రైతులకు గడ్డుకాలం

గత రెండేళ్లు మిర్చి క్రయవిక్రయాలు బాగా జరగడంతో రైతులకు క్వింటాల్‌కు రూ.20 వేల వరకు ధర లభించింది. అయితే ఈ సంవత్సరం ధర పతనమైంది. ఎగుమతులు లేకపోవడం, తేజ రకం నుంచి ఆయిల్‌ని వేరు చేసే కంపెనీల నుంచి ఆశించినంతగా కొనుగోళ్లు జరగక పోవడం తోనే ధర పతనమైనట్లు మార్కెటింగ్ వర్గాలు విశ్లేస్తున్నాయి. తేజ వెరైటీ మిర్చి తోలు పలచబడిందని కంపెనీలు కొనుగోళ్లను తగ్గించాయి. తెగుళ్ల వల్ల తోలు మందం తగ్గిందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. గుంటూరు మిర్చియార్డు నుంచి విక్రయమయ్యే మిర్చి వెరైటీలలో 60 శాతం తేజ రకమే. ఈ కారణంగా ధర నేలచూపులు చూసింది. క్వింటాల్‌కు రూ.10 వేల లోపే ధర లభించింది. మేలిమి కాయలకు మాత్రమే రూ.13 వేల వరకు ధర పెట్టి ఎగుమతిదారులు కొనుగోలు చేశారు.

70 లక్షల టిక్కీల నిల్వ

గుంటూరు నగర పరిసరాల్లోని 80కి పైగా ఉన్న పంక్షన్ల్ కోల్డ్‌స్టోరేజ్‌ల్లో ప్రస్తుతం 70 లక్షల టిక్కీలు రైతులు, వ్యాపారులు నిల్వ చేసినట్లు శీతలగిడ్డంగుల యాజమాన్యాల సంఘం నేత సురేంద్రబాబు తెలిపారు.

మాచర్లలో.. ట్రాఫిక్ టెర్రర్

హడలెత్తిస్తున్న ఆటో వాలాలు


మాచర్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాదచారులు, వాహన చోదకులు రోడ్డెక్కాలంటే మాచర్లలో ఆలోచిస్తున్నారు. విపరీతంగా పెరిగిపోయిన ఆటోలతో పట్టణంలో ట్రాఫిక్ టెర్రర్ పుట్టిస్తోంది. ఆటో డ్రైవర్లు ఎక్కడంటే అక్కడ ఎలాగంటే అలా ఆపేస్తూ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నారు. వీరిని అడ్డుకునేవారు.. ప్రశ్నించే వారు లేకపోవడంతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఇక ఆటోలకు తోడుగా వ్యాపారులు కొంచెం కొంచం అంటూ రోడ్డుపైకి వచ్చేశారు. మరికొందరు వ్యాపారులు దుకాణాల ముందు భాగం బడ్డీ బంకులకు, తోపుడు బండ్లకు అద్దెలకు ఇచ్చేశారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారిపోయాయి. పట్టణంలో సుమారు 300 వరకు ఆటోలు ఉండగా వారు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. మరికొందరు ఆటోలను ఎక్కడంటే అక్కడ నిలిపేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాక పోకలకు ఆటంకాలు కలిగి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ప్రధానంగా బస్టాండ్, మార్కెట్, చర్చి, ఆర్‌అండ్‌బీ, పత్తిఫ్యాక్టరీ, పోస్టాఫీసు, రింగురోడ్డు సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ అవాం తరాలు ఎదురవుతున్నాయి. ఆటో డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడపడం, ఓవర్ టేకింగ్, షడన్ బ్రేక్‌లతో హడలెత్తిస్తున్నారు.



రద్దీగా ఉంటే మార్కెట్ సెంటర్లో రోడ్డుపై ఆటోలు

రైతు బంధ్

- రుణం అందక రైతుల గగ్గోలు
- ప్రకటనల్లోనే రైతుబంధు పునరుద్ధరణ
- మూడు జిల్లాల్లో గతేడాది రూ.15 కోట్లు కేటాయింపు
- ప్రచారానికే పరిమితం.. రైతులకు ప్రయోజనం నామమాత్రం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గడం.. అయినకాడికి అమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోవడం రైతులకు పరిపాటిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ గోడౌన్లలో నిల్వ చేసుకుంటే నామమాత్రపు అద్దె వసూలుతో పాటు నిల్వ చేసుకున్న పంట విలువలో 70 శాతం రుణం రూపేణా అందించేది. దీని వల్ల రైతులు ఉత్పత్తులను సరైన ధరకు అమ్ముకోవడానికి కొంతమేర వెసులుబాటు దొరికేది. కానీ గత ప్రభుత్వంలో ఈ పథకం ఆనవాళ్లు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో రైతుబంధు పథకం పునరుద్ధరణపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగా గతేడాది అక్టోబరులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఈ పథకం కింద రూ.15 కోట్లు కేటాయించింది. కానీ అది ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆ ఫలాలేవీ తమకు అందలేదని రైతులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాకు రూ.4 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.5 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.6 కోట్ల విడుదలకు అనుమతులిచ్చింది. మూడు జిల్లాల పరిధిలో రూ.15 కోట్ల వరకు నిధుల కేటాయింపు జరిపితే అంతా కలిపి కోటి రూపాయలు కూడా రైతులకు మేలు జరగలేదు. బాపట్ల జిల్లాలో 9 మంది రైతులకు రూ.15లక్షల రుణ సదుపాయం కల్పించి మమ అనిపించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న చందంగా ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ ఫలాలు రైతులకు అందలేదు.

2014-19 మధ్య ముమ్మరం

రైతుబంధు పథకం 2014–19 మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున అమలైంది. పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకుని ఏడాదికి దాదాపు రూ.45 కోట్ల వరకు రుణాలను రైతులు తీసుకున్నారు. నిల్వకు నామమాత్రపు అద్దె, నిల్వ చేసిన దిగుబడిలో 70 శాతం మొత్తం తక్కువ వడ్డీకి తొమ్మిది నెలల గడువు రుణంతో రైతులకు మేలు జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పథకం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం ధర బహిరంగ మార్కెట్‌లో ఆశాజనకంగా లేదు. కొన్ని పరిమితులకు లోబడే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించింది. గడచిన ఖరీఫ్, ప్రస్తుతం ధాన్యం ధర మద్దతు రేటుకన్నా బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.300 వరకు తీసికట్టుగానే నమోదైంది. అయినా రైతుబంధు పథకంలో ధాన్యాన్ని నిల్వ చేసుకునే పరిస్థితులు లేక రైతులు తెగనమ్ముకుని నష్టాలు పాలయ్యారు. లక్షల టన్నుల ధాన్యం తక్కువ ధరకు దళారీల పాలైంది. రైతుబంధు పథకం ద్వారా రుణం ఇచ్చి ఉంటే అప్పులు తీర్చుకొని ఉండేవాళ్లమని రైతులు తెలిపారు.

గోదాముల విషయంలోనూ నిర్లక్ష్యం..

గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాలరాసి ఏకంగా మార్కెటింగ్ గోడౌన్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చింది. దీంతో రైతులకు అటు రైతుబంధు ఫలాలు ఎండమావిగా మారడంతో పాటు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పుడు కూడా గోదాముల విషయంలో దాదాపుగా అదే నిర్లక్ష్యం కొనసాగుతూ ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డుల్లో 178 వరకు గోదాములు ఉన్నాయి. వీటిలో దాదాపు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ గడచిన ఖరీఫ్ సీజన్‌లో మార్కెటింగ్ గోదాముల్లో నిల్వ చేసుకున్న ధాన్యం అంతా కలిపి కూడా 50,000 టన్నులకు మించలేదు. గోదాములలో నిల్వ సామర్థ్యం అంతంతమాత్రంగా ఉండడం కూడా రైతుబంధు పథకం అమలుకు ప్రతిబంధకంగా మారినట్లు తెలుస్తోంది.



బాపట్ల మార్కెట్ యార్డులోని గోడౌన్

యుద్ధానికి యువత సాయమందించాలి

● లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్


మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్

పెదకాకాని, మే9 (ఆంధ్రజ్యోతి): యుద్ధానికి అవసరమైనప్పుడు ప్రభుత్వ కోరిక మేరకు యువత సాయం అందించాలని, తమదైన రంగాల్లో రాణించి దేశభక్తిని చాటాలని 10(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ శుక్రవారం పేర్కొన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ బాలికల శిక్షణ శిబిరంలో విశ్రాంత మేజర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎస్.దశాకతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్‌పై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకునే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్ చెప్పారు. డాక్టర్ దశాక మాట్లడుతూ బాలికలు పాఠశాల దశలోనే ఎన్‌సీసీలో చేరడం ద్వారా భవిష్యత్ మెరుగ్గా ఉంటుందన్నారు.

13న పెన్షన్ అదాలత్

గుంటూరు (విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పట్టణంలోని కృష్ణానగర్‌లో ఉన్న ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదులను కార్యాలయం లేదా (94946 57469)వాట్సాప్, మెయిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 0864-2344106, 0864-2232921 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

చిరస్మరణీయంగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

విజేతలకు ద్విచక్ర వాహనాలు, నగదు బహుమతులు

పొన్నూరుటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ధూళిపాళ్ల మెమోరియల్ జాతీయ స్థాయి వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు పెద్ద ఎత్తున జరిగిన ఈ పోటీలను ప్రతి ఒక్కరూ సమన్వయంతో విజయవంతం చేయడంపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ధన్యవాదాలు తెలిపారు. సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా, పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఓరెడ్డి కేశవరెడ్డి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ బుల్స్ సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను సొంతం చేసుకున్నాయి. అలాగే ఇతర విజేతలకు పది ద్విచక్ర వాహనాలతో కలిపి మొత్తం రూ.30 లక్షల విలువైన బహుమతులను ప్రదానం చేశారు. 8 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో 131 జతల ఒంగోలు ఎడ్లు పాల్గొన్నాయి. ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహించారు. ఇందుకు 360 అడుగుల కోర్టును ఏర్పాటు చేశారు.


ప్రథమ బహుమతి కేశవరెడ్డికి రాయల్‌ఎన్‌ఫీల్డ్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, నాగసాయి వైదీప్తి

ప్రేక్షకులు, ఎడ్లకు ఎండ తీవ్రత లేకుండా సాయంత్రం వేళల్లో బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ప్రాంగణం చుట్టూ ఐదువేల మంది పట్టేలా గ్యాలరీలను సిద్ధం చేశారు. పాల్గొన్న ప్రతి ఎడ్ల జత యజమానికి ప్రోత్సాహక బహుమతులు, మామిడి మొక్కలను నిర్వాహకులకు అందజేశారు. రాష్ట్ర మంత్రులు పోటీలకు హాజరై, బహుమతులు ప్రదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

టీడీపీ శ్రేణులకు.. విద్యుత్ ఉద్యోగి షాక్..!

● నాడు దుర్భాషలాడి.. నేడు సీఎంను కలిసి..
● విద్యుత్ శాఖ ఉద్యోగికి టీడీపీలో పెద్దపీట
● వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలా వ్యవహారం
● పార్టీ అధిష్టానం.. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదులు


సీఎంతో విద్యుత్ ఉద్యోగి బంగారయ్య

నరసరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): అతను విద్యుత్ శాఖలో ఉద్యోగి. వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను నానా దుర్భాషలాడాడు. నాడు వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌గా పేరొందాడు. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. నరసరావుపేట నియోజకవర్గం గోపిరెడ్డి అడ్డా 60 వేల మెజార్టీతో పల్నాడు జిల్లాలో అయన చరిత్ర సృష్టించబోతున్నారు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఘనత ఆ ఉద్యోగిది. పార్టీ అధినేతలను సోషల్ మీడియా వేదికగా తిట్టిన వ్యక్తి.. నేడు సీఎం చంద్రబాబును కలవడంతో పార్టీ శ్రేణులు కంగుతిన్నాయి. ఉద్యోగి తన కుటుంబ సభ్యుని పేరుతో ఏర్పాటు చేసిన హెవీ వాహనాల డ్రైవింగ్ స్కూల్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు, లోకేష్‌ను తిట్టిన విద్యుత్ శాఖ అకౌంట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రాఘవరపు బంగారయ్య.. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి బుధవారం చంద్రబాబును కలవడం గమనార్హం. ఈ ఫోటోలు.. నాడు చంద్రబాబు.. లోకేశ్‌కు వ్యతిరేకంగా పెట్టిన పోస్టులను టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. పార్టీ అధినేతలను దుర్భాషలాడిన ఉద్యోగిని చంద్రబాబు దగ్గరకు తీసుకువెళడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ మేరకు సదరు ఉద్యోగి.. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా, డాక్టర్ గోపిరెడ్డికి అనుకూలంగా పెట్టిన పోస్టులను, వైసీపీ నేతలతో ఉన్న చిత్రాలను పార్టీ అధిష్టానానికి పంపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడా పిర్యాదు చేశారు. చంద్రబాబును తిట్టినా సరే సదరు ఉద్యోగి కోటు వేసి చంద్రబాబును కలిపేంత గొప్ప మనసున్న మారాజు అరవిందబాబు అంటూ సోషల్ మీడియాలో క్యాడర్ పోస్టులు పెట్టడం పార్టీలో చర్చనీయంశమైంది. దీని ద్వారా పార్టీ క్యాడర్‌కు ఎటువంటి సందేశం ఇస్తున్నారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. సదరు ఉద్యోగి విధులకు సరిగా హాజరు కాకపోయినా చర్యలు లేవని, వెంటనే చర్యలు తీసుకొవాలని పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

హత్యాయత్నం కేసులో నలుగురికి రిమాండ్

నిందితుల్లో వైసీపీ ఎంపీటీసీ కల్పన

మంగళగిరి సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన నలుగురు నిందితులకు మంగళగిరి న్యాయస్థానం రెండు వారాల రిమాండ్ విధించింది. తాడికొండ సీఐ కె.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కంతేరు గ్రామంలో గత నెల 25న చెలరేగిన వివాదం వర్గపోరుకు దారితీసింది. ఓ వర్గం మరో సామాజిక వర్గంపై దాడికి పాల్పడినట్లు తాడికొండ పోలీసులకు ఫిర్యాదు అందింది. మొత్తం పది మందిపై కేసు నమోదు కాగా, వారిలో నలుగురు నిందితులను శుక్రవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కర్రి నిఖిల్ (ఏ-5), కర్రి మహాలక్ష్మి (ఏ-7), వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన (ఏ-8), కర్రి విజయభాస్కర్ (ఏ-10) ఉన్నారు. నిందితులను మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు వారాల రిమాండ్ విధించారు. అరెస్టయిన వారి తరపున మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతలు డైమండ్ బాబు, వేమారెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజు తదితరులు న్యాయవాదులతో కలిసి కోర్టు వద్దకు వచ్చారు.

విద్యుత్ ప్రాజెక్టు భద్రతపై ఎస్పీఎఫ్ ప్రత్యేక దృష్టి

రెంటచింతల, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు భద్రత గురించి ఎస్పీఎఫ్(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఉన్నతాధికారులు శుక్రవారం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇప్పటి వరకు భద్రత పరంగా ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారనే దానిపై సమీక్షించారు. పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఎస్పీఎఫ్ డీఎస్పీ టీకే చారి స్థానిక ఎస్ఐ మూర్తితో మాట్లాడారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించాలని, నిఘా కట్టుదిట్టంగా ఉంచాలని ఆదేశించారు. క్షణం క్షణం ఉన్నతాధికారులతో టచ్‌లో ఉండాలని కోరారు. సత్రశాలలోని ప్రాజెక్టు వద్ద 17 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది డ్యాంకు ఇరువైపులా, గేట్ల దగ్గర భద్రతా విధులు నిర్వహిస్తున్నారు.


టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు(ఫైల్ ఫోటో)

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

ట్రాలీ ఢీకొని..ద్విచక్ర వాహనదారుడి మృతి

నూజెండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్త ఉప్పలపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన కుంటా వెంకటరెడ్డి(62) వ్యక్తిగత పనుల నిమిత్తం వినుకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఉప్పలపాడు నుంచి ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం కొమ్మవరం గ్రామానికి కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి రోడ్డుపై పడడంతో.. మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ

గురజాలటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న ఖైదీ పరారైన ఘటన శుక్రవారం జరిగింది. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో నిందితుడిగా.. గురజాల సబ్ జైలులో షేక్ జిలానీ రిమాండ్‌లో ఉన్నాడు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది మధ్యాహ్నం జైలు నుంచి జిలానీని గురజాల కోర్టుకు వాయిదా నిమిత్తం తీసుకెళ్లారు. ఇదే అదునుగా నిందితుడు పోలీసు సిబ్బంది కళ్లుగప్పి కోర్టు వద్ద నుంచి పరారయ్యాడు. దీనిపై సబ్‌జైల్ సూపరింటెండెంట్ అచ్చినాయుడును వివరణ కోరగా.. జరిగిన ఘటనపై గురజాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

వ్యవసాయ పర్యావరణ కూటమిలో
రైతు సాధికార సంస్థకు సభ్యత్వం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పర్యావరణ కూటమిలో ఏపీ రైతు సాధికార సంస్థ సభ్యత్వం తీసుకోనుంది. రైతు సాధికారత, సుస్థిర, సహజ వ్యవసాయం, వాతావరణ స్థితి స్థాపకత, పర్యావరణం కోసం ఏపీ సామాజిక సహజ వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ మార్గదర్శక ప్రయత్నాలకు గుర్తింపుగా కూటమిలో సభ్యత్వం తీసుకోనుంది. ఈ మేరకు వ్యవసాయ పర్యావరణ కూటమి నుండి రైతుసాధికార సంస్థకు ఆహ్వానం అందింది. సభ్యత్వానికి ఆర్థిక బాధ్యత లేనందున రైతు సాధికార సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏపీ-ఏఐసీఈటీ ఇంటర్న్‌షిప్స్ డ్యాష్ బోర్డు ప్రారంభం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యార్థులకు ఉన్నత విద్యామండలి, జాతీయ సాంకేతిక విద్యా మండలి సంయుక్తంగా వేసవి స్వల్ప కాలిక ఇంటర్న్‌షిప్‌లు అందించనున్నాయి. దీనికి సంబంధించిన డ్యాష్ బోర్డును ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ ఏడాది మూడు లక్షల మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ నెల 7 నుంచి 18 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్, 23న విద్యార్థుల ఎంపిక, 25న జాబితా ప్రకటిస్తారని వివరించింది. జూలై 27 నాటికి ఈ ఇంటర్న్‌షిప్‌లు పూర్తవుతాయి.

వైసీపీ నేత దాడిలో గాయపడి..చికిత్స పొందుతూ మృతి


బెజవాడ రమేష్ (ఫైల్‌ఫోటో)

మాచర్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు గొడ్డలితో దాడి చేయడంతో టీడీపీ కార్యకర్త కోమాలోకి వెళ్లి.. నాలుగు నెలలపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన టీడీపీకి కార్యకర్త బెజవాడ రమేష్ (28)కు, అతని మామ వైసీపీకి చెందిన పండ్ల హరిశ్చంద్రకు కుటుంబ కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబరు 16న హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేశాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతను కోమాలోకి వెళ్లడంతో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో నాలుగు నెలలుగా చికిత్స అందిస్తున్నారు. అప్పటి నుంచి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే రమేష్ కోమాలో ఉండడంతో కుటుంబ సభ్యులు మనస్తాపానికి గురై గత నెలలో హరిశ్చంద్ర (60)ను హతమార్చారు.

కంటైనర్, బైక్ ఢీ: విద్యార్థులకు గాయాలు

● పెట్రోలు లీకై దగ్ధమైన బైక్


గాయపడిన విద్యార్థిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న 108 సిబ్బంది

యడ్లపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కంటైనర్, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు గాయపడగా, బైక్ దగ్ధమైంది. వంకాయలపాడు సమీపంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని జగ్గాపురం, యడ్లపాడు గ్రామాలకు చెందిన వెంకటేష్, హరీష్, చిలకలూరిపేట మండలం సోమరపాడు గ్రామానికి చెందిన శివబాబు ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. మధ్యాహ్నం కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై ముగ్గురూ ఇంటికి బయలుదేరారు. వంకాయలపాడు-ఎస్ఎస్ఎల్ టెక్స్ టైల్స్ మధ్య ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. బైక్‌తో సహా ముగ్గురూ రోడ్డుపై పడి, తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనం ట్యాంకు నుంచి పెట్రోలు లీకై మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు 108కు సమాచారం అందించగా.. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 513.40 అడుగులు ఉంది. ఇది 137.51 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,350, మొత్తం ఔట్‌ఫ్లో 1,350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

లిఫ్టులో ఇరుక్కుపోయిన ఎంపీ, చీఫ్ విప్


బయటకొస్తున్న చీఫ్ విప్ జీవీ

వినుకొండటౌన్, మే 9, (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లి కార్జున రావు ఎక్కిన లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో కొన్ని నిమిషాలపాటు నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. లాయర్ స్ట్రీట్‌లో ఉన్న యూనియన్ బ్యాంకుపై నూతనంగా ఏర్పాటు చేసి ఉషోదయ సోలార్ అండ్ అగ్రీ కార్యాలయం ప్రారంభోత్సవానికి కార్యక్రమానికి ఎంపీ, చీఫ్ విప్, జీడీసీసీ చైర్మన్ హాజరయ్యారు. బిల్డింగ్ యజమానితో కలిసి రెండో అంతస్తుకు చేరుకునేందుకు వీరు లిఫ్టు ఎక్కారు. కెపాసిటి ముగ్గురికి మించి అందులో ప్రయాణింకూడదు. కానీ, నలుగురు ఎక్కడంతో రెండు అంతస్తుల మధ్య లిఫ్టు ఆగిపోయింది. దీంతో కార్యకర్తలు, నాయకులు గాబరాపడ్డారు. ఇంతలో లిఫ్టు మెకానిక్‌ని తీసుకువచ్చి మరమ్మతులు చేపట్టడంతో.. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

96,112 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 85,708 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,112 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,960 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13400	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	----	----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12500
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	10000	12600	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆలయాల హుండీల లెక్కింపు

రెంటచింతల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల హుండీ కానుకలను ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లీలావతి సమక్షంలో శుక్రవారం లెక్కించినట్లు ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు. రెంటచింతల శివాలయం హుండీ ద్వారా రూ.8691, సత్రశాల ఆలయంలో రూ.21,850 వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి, పూజారి నాగేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

12న నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్

వెల్దుర్తి, మే 9(ఆంధ్రజ్యోతి): మాచర్లలోని వీవీఎస్ గార్డెన్స్‌లో ఈనెల 12వ తేదీన నియోజకవర్గస్థాయి గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాషా తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు గ్రీవెన్స్‌లో పాల్గొంటారన్నారు. నియోజకవర్గ ప్రజలు సమస్యలుంటే గ్రీవెన్స్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

● దుర్గి, మే 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గస్థాయిలో మాచర్లలో జరిగే గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ కోరారు.

● మాచర్లటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవీఎన్ గార్డెన్‌లో ఈనెల 12న ఉదయం 10 గంటలకు నియోజకవర్గస్థాయి గ్రీవెన్స్‌లో అర్జీలు అందించవచ్చని తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ తెలిపారు.

కోళ్లఫారంలో 50 కోళ్లు దొంగతనం

గురజాలటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): గురజాలలోని మాడుగుల రోడ్డులోగల కోళ్లఫారంలో గురువారం అర్థరాత్రి 50 కోళ్ల చోరీ జరిగింది. ఫారం యజమాని వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోళ్ల ఫారం గోడకు గుర్తు తెలియని వ్యక్తులు రంధ్రం చేసి 50 కోళ్లను దొంగిలించారు. పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

మాచర్లటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆధ్వర్యాన పట్టణంలోని వాసవీ లాడ్జి, రాయవరం జంక్షన్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి నక్షత్ర ప్రసాదరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నేతలు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నప్రసాదం అందజేత

కారంపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణీలకు, వైద్య సిబ్బందికి శ్రీవాసవీ అన్నప్రసాద కమిటి అధ్వర్యాన అన్నప్రసాదం అందజేశారు. వెలుగూరి శేషారావు, భారతి దంపతులు కార్యక్రమానికి సహకరించారు. కార్యక్రమంలో సముద్రాల ప్రకాష్, వెలుగూరి అశోక్‌కుమార్, శ్వేత, భవిరిశెట్టి రామారావు, లక్ష్మీ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల నియామకం

నకరికల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ కమిటీలను, అనుబంధ కమిటీలు, బూత్ ఇన్‌చార్జ్‌లను, యూనిట్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నట్టు రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మొత్తం 17 గ్రామ పంచాయతీలకు ఎనిమిది పంచాయతీల్లో టీడీపీ బూత్‌స్థాయి కమిటీలను నియమించినట్టు తెలిపారు. మిగతా 9 గ్రామాల్లోను నియమించనున్నట్టు తెలిపారు. సమావేశంలో సాగి శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టండి

● ఎంపీడీవో రామచంద్రరావు

పిడుగురాళ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ప్రతి రైతు ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిపథకం, ఉద్యాన, వ్యవసాయశాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్రరావు, ఉద్యానశాఖ అధికారి మోహన్‌లు మాట్లాడుతూ పొలం గట్లు, ఖాళీస్థలాల్లో పండ్లమొక్కల పెంపకంతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. సమావేశంలో ఏపీవో మేరిగ్రేస్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

దాచేపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో ది మదర్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు నాగండ్ల రత్నం శుక్రవారం తెలిపారు. నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు. వివరాలకు 99660 45613లో సంప్రదించాలని కోరారు.

పనిని బట్టే వేతనం: ఏపీవో కోటిరెడ్డి

మాచవరం, మే 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి శ్రామికులకు చేసిన పనిని బట్టి వేతనం వస్తుందని, శ్రామికులందరూ కలసి పని చేసినప్పుడే గరిష్ట వేతనం లభిస్తుందని ఏపీవో కోటిరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని వేమవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి శ్రామికులకు సూచనలు చేశారు. పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సు, మంచినీటి వసతి, టెంట్‌ల ఏర్పాటు తదితర సౌకర్యాలు ఉండేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు చూసుకోవాలని ఆదేశించారు. ఇటీవల నిర్మించిన నీటితొట్లను పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ కామిశెట్టి గోపాలరావు, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీలక్ష్మీ గణపతి పూజలు

దాచేపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని నారాయణపురం పాత రామాలయ దేవస్థానంలో శ్రీలక్ష్మీగణపతి శ్రీచక్ర, కామాక్షి సమేత భీమేశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యం నూతన జీవధ్వజ యంత్ర బింబ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అంకుర్పారణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం చండీ హోమం, క్షీరాధివాసం, లలిత సహస్రనామ పారాయణం చేపట్టారు. ఆలయ ధర్మకర్త రామ్ ప్రసాదు పర్యవేక్షించారు.

నిత్యావసరాల అందజేత

సత్తెనపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధాశ్రమానికి ఖమ్మం షేర్దా విజయన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు, టీవీ, మిక్సీ, గ్యాస్ పొయ్యి, కుర్చీలు, మంచాలు, డైనింగ్ టేబుల్స్, ఫ్యాన్లు, వాషింగ్ మిషన్‌లు, బియ్యం, పరుపులు, నూతన వస్త్రాలు మునిసిపల్ కమిషనర్ ఎన్ ఆనంద్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను సంస్థ ప్రెసిడెంట్ నారాయణను ఆశ్రమ నిర్వాహకులు కే ఇంద్రసేన, కే రిషిత, పీ నాగేశ్వరరావులు ఘనంగా సన్మానించారు.

మట్టి నమూనాల సేకరణ

బెల్లంకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం భూసార పరీక్షలు నిర్వహించినట్టు ఏవో కృష్ణయ్య పేర్కొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడటం, రసాయన ఎరువుల ఖర్చులు తగ్గించటంతో పాటు చీడపీడలు తగ్గుతాయన్నారు. సమతుల్య ఎరువులు వాడటంతో నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చన్నారు. మట్టినమూనాల సేకరణను రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన సలహా సహాయకురాలు రజిని, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు జల్లుతున్న ఎమ్మెల్యే జూలకంటి

ప్రకృతి వ్యవసాయంతోనే ఆర్థిక వృద్ధి

● దుక్కిదున్ని, విత్తనాలు జల్లిన ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, మే 9(ఆంధ్రజ్యోతి): రైతాంగం ప్రకృతి వ్యవసాయంతోనే ఆర్థిక ప్రగతిని సాధించవచ్చని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం రెంటచింతలలోని గుంటూరు హైవే పక్కన ఓ వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ అనుబంధ అంశాలపై మండల వ్యవసాయశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, కొత్తరకం నువ్వుల పంటల సాగు, మట్టి నమూనాల సేకరణ, రైతులకు తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జూలకంటి భూమిపూజ చేసి, ప్రభుత్వం అందించిన పచ్చిరొట్టలో 30 రకాల చిరుధాన్యాలను పొలంలో చల్లారు. అనంతరం మట్టి సేకరణ పనులు ప్రారంభించి, రొటావేటర్ ద్వారా దుక్కిదున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తన ఇంటికి కావాల్సిన చిరుధాన్యాలను కొనుగోలు చేశారు. అలాగే రైతులకు తైవాన్ స్ప్రేయర్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ కుమారి మేరి కనకం, ఏవో బ్రహ్మారెడ్డి, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ వినోద్, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరెడ్డి, టీడీపీ మండల నేతలు సుమంత్‌రెడ్డి, రాజారెడ్డి, నరసింహారావు, తుమ్మా జోజిరెడ్డి, బోడపాటి రామకృష్ణ, రాయపరెడ్డి, శౌరైడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

వెల్దుర్తి, మే 9(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. దుర్గి మండలం ఓబులేశునిపల్లె గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నేత కొమ్ము కిషోర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పార్టీ సభ్యత్వం ఉండడంతో అతని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి స్థానిక క్యాంపు కార్యాలయంలో రూ.5లక్షల ప్రమాద బీమా చెక్‌ను అందించారు. కార్యక్రమంలో దుర్గి మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



రాజుపాలెం: రెడ్డిగూడెంలో భారత సైన్యానికి మద్దతు తెలుపుతున్న ముస్లింలు తదితరులు

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

● భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీలు

రాజుపాలెం, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలను భారతసైన్యం ధ్వంసం చేయటం సంతోషంగా ఉందని మండలంలోని రెడ్డిగూడెం గ్రామ ముస్లింలు అన్నారు. శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, ఎస్సై వేణుగోపాల్ తదితరులు కొండమోడు-పేరేచర్ల రహదారిపై, గ్రామ ప్రధానసెంటర్లో భారతసైన్యానికి మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నర్రా బాబురావు, సయ్యాద్ డాక్టర్ జిలానీ, షేక్ బాబావలి, పఠాన్‌వలి, డాక్టర్ షరీఫ్, నాగుల్‌మీరా, నర్రా మల్లయ్య, షేక్ రహీం, ఈపర్ల సుభాని, షేక్ ఇమ్రాన్, మెకానిక్ సైదా, మాజీ సర్పంచ్ తుపాకుల కేశవులు తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదాన్ని భారత్ ఉపేక్షించదు

నకరికల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్‌లో ఉగ్రవాదానికి తావులేదని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఎవరినైనా భారత్ తిప్పి కొడుతుందని సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్ అన్నారు. శుక్రవారం స్థానికులతో కలసి పాక్‌పై యుద్ధం చేస్తున్న భారత త్రివిధ దళాలకు, భారత్ ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



నకరికల్లు: ర్యాలీలో పాల్గొన్న రూరల్ సీఐ కిరణ్, ఎస్ఐ సురేష్

పరిపాలనలో ఎంపీపీ విఫలం

ముప్పాళ్ళ, మే 9(ఆంధ్రజ్యోతి): పరిపాలనలో ఎంపీపీ విఫలం చెందారని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్యసమావేశంలో బొల్లవరం ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కరరెడ్డి ఎంపీపీ మారూరి పద్మావతిపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో మండల పరిషత్ నిధులు సభ్యులకు తెలియకుండా ఖర్చుచేశారని ఆరోపించారు. రాజకీయ కారణాలతో తనను ఇబ్బందులు పెట్టేందుకు ఇలా మాట్లాడుతున్నారని ఎంపీపీ పద్మావతి అన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.రత్నం, తహసీల్దార్ భవానీశంకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో మండలంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని బొల్లవరం ఎంపీటీసీ వీరభాస్కరరెడ్డి ఆరోపించారు. సభ్యులకు తెలియకుండా ఏకపక్షంగా పనులు చేసి ఎంపీపీ అవినీతికి పాల్పడ్డారని దానిపై విచారణ చేయాలని ఆయన విలేకరుల సమావేశంలో అన్నారు.

గర్భిణులకు ఆహార పొట్లాల పంపిణీ

బెల్లంకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం పీహెచ్‌సీలో శుక్రవారం 70మంది గర్భిణులకు టీడీపీ మండల నాయకుడు వెన్నా సీతారామిరెడ్డి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు ఎస్‌కే నజీర్ గర్భిణులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అమర జవాన్‌కు ఎమ్మెల్యే ప్రవీణ్ నివాళి

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి) పాకిస్తాన్ ఉగ్రమూకలతో జరుగుతున్న యుద్ధంలో అమరుడైన సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం గోరంట్ల మండలానికి చెందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు పెదకూరపాడు నియోజకవర్గం తరుపున ఘనంగా నివాళులర్పిస్తున్నట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం అమరావతిలో మురళీనాయక్ మృతికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం పట్టణంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● దాచేపల్లి: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ భగవాన్‌నాయక్ తెలిపారు.

● సత్తెనపల్లి: పట్టణంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 10వ తేదీ పట్టణంలో ఉదయం 8నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు.

● రాజుపాలెం: రాజుపాలెం మండలంలో అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ కోటా పెదమస్తాన్ తెలిపారు.

● నకరికల్లు: మరమ్మతుల కారణంగా నకరికల్లు మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు నకరికల్లు ఏఈఈ ఎస్‌కే గౌస్ తెలిపారు.

సమగ్ర వైద్యశాల అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని వైద్యవిధాన పరిషత్ సమగ్ర వైద్యశాల అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. చైర్మన్‌తో కలిపి 8మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మెంబర్‌గా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మెంబరు, కన్వీనర్‌గా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ చందూలాల్ నాయక్, మెంబర్లుగా ఎంపీడీవో శివపార్వతి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, బొబ్బాల సౌజన్య, జి.కిరణ్, నాగలక్ష్మిని ప్రభుత్వం నియమించగా వారు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిటీ సభ్యులు వైద్యశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలందితేనే ప్రజలలో కూటమి ప్రభుత్వంపై నమ్మకు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యం కాపాడుకోవాలి

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అమరావతిలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో జనచైతన్యసమితి ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, భాష్యం అంజనేయులు, బి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.26ని అమలు చేయాలి

పెదకూరపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన జీవో నెం.26ను అమలుచేయాలని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ కోరారు. వెలగపూడిలో సచివాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎస్ సత్యనారాయణను ఆయన కలసి శుక్రవారం వినతిపత్రం అందించారు. నాయీ బ్రాహ్మణులకు పోలీసు బ్యాండ్, పోలీసు బార్బర్, ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యోగాలకు జీవో ఇచ్చారని అన్నారు.

11న పెదకూరపాడులో కంటి వైద్య శిబిరం

పెదకూరపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 11వ తేదీన పెదకూరపాడులోని ఆర్‌సీఎం స్కూల్ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరగనున్నదని యూనియన్ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ రాజు శుక్రవారం తెలిపారు. శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. సాధారణ, దంత వైద్య శిబిరాలను కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, పావులూరి హరీష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

క్రోసూరు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెవారిపాలెం గ్రామానికి చెందిన జి.సంపూర్ణ(23) అదృశ్యంపై కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సంపూర్ణ మార్చి 7వ తేదీన తన తాతగారి ఇంటికి వెళ్ళి వస్తానని రాత్రి 7:30 సమయంలో వెళ్ళి తిరిగి ఇంతవరకు రాలేదని ఆమె తండ్రి కోటి లింగయ్య శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవిబాబు తెలిపారు. సంపూర్ణ ఆచూకీ తెలిసినవారు 94407 96235కు గాని, క్రోసూరు పోలీసుస్టేషన్ నెం.08640-227133కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

పెదకూరపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు, 75 తాళ్ళూరులోని ప్రభుత్వ వైద్యశాలల్లో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు, వైద్యులు పాల్గొన్నారు.

అధికార ముద్ర లేకుండానే దర్పమా..!

సత్తెనపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మార్కెట్ యార్డు పాలకవర్గ నియామకానికి ఇంకా ప్రభుత్వపరంగా జీవోనే రాలేదు. అయినా అభినందన సభ ఏర్పాటుచేశారు. ప్రమాణ స్వీకారం చేయకుండానే చైర్‌పర్సన్ భర్త మార్కెట్ యార్డులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారం చేయకుండానే చైర్‌పర్సన్ భర్త నేమ్ బోర్డుగా రాయించు కోవటం, చైర్‌పర్సన్ కుర్చీలో కూర్చోవటం, శాలువాలు కప్పించుకోవటం సరైన పద్ధతి కాదన్నారు. అది కూడా చైర్‌పర్సన్‌కు బదులు ఆమె భర్త యార్డులో ఇష్టారాజ్యంగా వ్యవహరించటం తగదన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రవిబాబు

సత్తెనపల్లి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ రవిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బృగుబండ, రెంటపాళ్ళ గ్రామాల్లో శుక్రవారం ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామన్ వర్క్ ఐడీ వ్యవస్థను రద్దు చేసి మేట్ల వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. కూలీలకు వారం వారం వేతనాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి పని గుర్తింపులను రద్దు చేసి ప్రతి పనికి గుర్తింపు నెంబరు ఇవ్వాలన్నారు. కూలీలతో మాట్లాడినవారిలో సంఘ మండల కార్యదర్శి చమండ్లమూడి భగత్, మండల నాయకులు ఉన్నారు.



పిడుగురాళ్లలో నిర్వహిస్తున్న కిశోర బాలికల అవగాహన సదస్సు

కిశోర బాలికల అవగాహన సదస్సు

పిడుగురాళ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి యుక్తవయసు పిల్లలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని 24వ వార్డులో నిర్వహించారు. జిల్లా బాలల రక్షణ అధికారి డి.శౌరిరాజు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల మాతృమరణాలు, శిశుమరణాలు, రక్తహీనత సంభవించి ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. బాల్యవివాహాలను గుర్తిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసన్నకుమారి, కె.కోటేశ్వరి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉదయదీపిక, ఏఎన్ఎం, ఆశవర్కర్లు, మెప్మా ఆర్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనారోగ్య సమస్యలు

ముప్పాళ్ళ, మే 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ అన్నారు. ముప్పాళ్ళ అంగన్‌వాడీకేంద్రంలో కిశోర వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. చిన్నవయస్సులోనే తల్లి అయితే జీవితకాలం అనారోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ, మే 9(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేస్తే కఠినచర్యలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగు సెంటర్లకు కిశోర వికాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

క్రోసూరు, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవి, రత్నకుమారి అన్నారు. క్రోసూరు ఎస్టీ కాలనీ, దొడ్లేరు గ్రామాల్లో జరిగిన కిశోరి వికాస కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కిశోర వికాసం, స్పెషల్ క్యాంపు

అచ్చంపేట, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేవీపాలెం, అంబడిపూడి గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం ఆధ్వర్యంలో కిశోరి వికాసం స్పెషల్ క్యాంపు నిర్వహించారు. కిశోరబాలికలు పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



కార్డెన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న మారణాయుధాలతో పోలీసులు

కేపీగూడెంలో కార్డెన్‌సెర్చ్

వెల్దుర్తి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడెంలో శుక్రవారం గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతురావు ఆధ్వర్యాన కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 మోటారు సైకిళ్లు, 6 కత్తులు, 8 గొడ్డళ్లు, 12 గడ్డ పలుగులు, 2 బరిసెలను పోలీసులు గుర్తించారు. కార్యక్రమంలో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే పల్లెనిద్ర

● ఎస్ఐ రవిబాబు

క్రోసూరు, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణ కోసమే పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ పీ రవిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రబాలెంలో గ్రామస్తులతో కలసి ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోనుకాకుండా పరిష్కారం చేసుకోవాలన్నారు. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామస్తులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరం వచ్చినా వందకు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏపూరి శ్రీనివాసరావు, కుంభా ఏడుకొండలు, ఏపూరి గోవిందు, కొజ్జా అమరయ్య, పగడాల రాజు, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్ విస్తృత పర్యటన

సత్తెనపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ పర్యటించారు. తాలూకా సెంటర్‌లో ఉచిత మంచినీటి చలివేంద్రం వద్ద బురదను పారిశుధ్య కార్మికుల చేత తొలగింపచేశారు. వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్ళేమార్గంలో వ్యర్థాలను రోడ్డు మీద వేయవద్దని కూరగాయల మార్కెట్ వ్యాపారులకు సూచించారు. ఎవ్వరూ మునిసిపల్ డ్రెయిన్‌ల మీద వ్యాపారాలు చేయవద్దన్నారు. అటువంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మునిసిపల్ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే సహించేది లేదన్నారు. ప్లాస్టిక్ కవర్లను వ్యాపారులు విక్రయించరాదని, ప్రజలు కూడా వాటిని వాడకూడదన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో మురళీకృష్ణ ఆధ్వర్యాన గురజాల అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు, రెండు కి.మీ.ల దూరంలో 800 నుంచి 1200 ఓటర్లు వున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించడం తదితర అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో నియోజకవర్గంలోని రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేస్ట్ డీకంపోజర్ తయారీపై అవగాహన

నకరికల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): రైతులు వేస్ట్ డీకంపోజర్‌ను తయారు చేసే విధానాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు తెలిపారు. శుక్రవారం చీమలమర్రి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పంటకోత తరువాత దీనిని నేలలో వేయటం ద్వారా పంట మొదళ్ళు త్వరగా నేలల్లో కలసి ఎరువుగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు కుట్టు శిక్షణకు హాజరుకావాలి

కుట్టుమిషన్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న మహిళలు నకరికల్లులో హాజరుకావాలని బీసీ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ కాకర్ల నాగదుర్గ కోరారు. శుక్రవారం ఆమె నకరికల్లులో మాట్లాడుతూ నకరికల్లు, ముప్పాళ్ళ, నందిగామలో ఉన్న కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలు ప్రారంభమైనట్లు తెలిపారు. సమావేశంలో ట్రైనర్ ఉమ్మారెడ్డి విజయకుమారి, సీవో పీ శివలత పాల్గొన్నారు.

ముగిసిన కార్మిక శాఖ వారోత్సవాలు

సత్తెనపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ వీ విజయకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో కార్మికశాఖ వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పలు ప్రాంతాల్లో న్యాయ సేవాధికార సంస్థ, వివిధ కార్మిక యూనియన్‌లు ఈ వారోత్సవాల్లో పాల్గొన్నాయి. కార్మికులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో పారా లీగల్ వలంటీరు సుభానీ, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో రత్నం

ముప్పాళ్ళ, మే 9(ఆంధ్రజ్యోతి): నూతన ఎంపీడీవోగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన పి.రత్నంను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు. రత్నం దాచేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా చేస్తూ పదోన్నతిపై ముప్పాళ్ళ వచ్చారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా హనుమంతరావు

కారంపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శిగా సూరే హనుమంతురావు, సహాయ కార్యదర్శిగా జింకల వెంకట కోటేశ్వరరావు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక ఆదినారాయణ స్థూపం వద్ద ఈ ఎన్నిక జరిగింది. జిల్లా కార్యదర్శి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, కేతావత్ రంగనాయకులు, షేక్ సైదా, లింగేశ్వరరావు, నాగమణి, శశిదేవి, గాలం శ్రీనివాసరావు, జింకల వెంకటరమణ, సైదాబీ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీగణపతి దేవాలయ ముఖ మండపం ప్రారంభం

నకరికల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకలగుంటలో ఉన్న భద్రకాళి సమేత ఉత్కంఠవీరభద్రస్వామి దేవాలయంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీగణపతి దేవాలయ ముఖమండపాన్ని గ్రామానికి చెందిన తెలగమనేని సాయిబాబ నిర్మించారు. శుక్రవారం దీనిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆవుల సుబ్బయ్య, మర్రివేముల సిద్దయ్య, రుసుం కోటయ్య, అంకారావు, ఎం.మహంకాళిరావు, కె.చిన్న, ఏ ఆదెయ్య కే మాణిక్యారావు, పి.వెంకటకృష్ణారావు, టి.సీతారామయ్య, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కారంపూడి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపరాజుపల్లిలో శ్రీసిమెంట్ ఫౌండేషన్ సహకారంతో రూ.26లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీసిమెంట్ ప్రతినిధులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, గుర్రపుసాల శ్రీనివాసరావు, చల్లా కొండలు, జినుగు నాగరాజు, నున్నా జనార్ధన్, అద్దంకి శ్రీనివాసరావు, రాజనాల శ్రీనివాసరావు, నల్లమేకల ఆదినారాయణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భోజన కుతూహలం

పల్లేరుతో భేషైన ఆరోగ్యం..!

పల్లేరు మనకు చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది. చాలా మంది దీన్ని పిచ్చి మొక్క అనుకుంటారు. కానీ పల్లేరు కాయలు, ఆకుల వల్ల అమితమైన ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి.



పల్లేరును సంస్కృతంలో 'గోక్షురం' అని పిలుస్తారు. 'గోక్షురం' అంటే శరీరానికి చల్లదనాన్ని, బలాన్ని, పుష్టిని అందించేదని అర్థం. పల్లేరుకాయలు చిన్నవి, పెద్దవి అని రెండు రకాలుగా ఉంటాయి. పెద్ద పల్లేరుకాయల్ని 'గజపల్లేరు' అంటారు. ఈ కాయను రెండుగా చీలిస్తే- లోపల భాగమంతా జిగురుగా ఉంటుంది. ఈ జిగురు మన శరీరానికి ఎంతో ఉపకరిస్తుంది. కేవలం జిగురు మాత్రమే కాదు, పల్లేరు ఆకులు, కాయలు, వేర్లు... ఇవన్నీ త్రిదోష సమతుల్యతను కలిగిస్తాయి. చిన్న పల్లేరు కాయలకు కూడా ఈ తరహా గుణాలే ఉంటాయి. పల్లేరు కాయలు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

- పల్లేరు ఆకులను ఎండబెట్టి వాటితో ఉదయాన్నే టీ చేసుకొని తాగితే చర్మానికి కాంతి వస్తుంది.
- పల్లేరు ఆకులను సలాడ్‌లో వేసుకొని తింటే మూత్రంలో మంట తగ్గుతుంది. మూత్రనాళంలోని రాళ్లు కరిగిపోతాయి.
- పల్లేరు కాయలను ఎండబెట్టి కషాయంగా చేసి తాగితే హార్మోన్ల అసమతౌల్యం కలిగే రకరకాల సమస్యలు తగ్గుతాయి. యువతులను వేధించే 'పోలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్' (పీసీఓడీ)కు కూడా ఇది మంచి పరిష్కారం.
- పల్లేరు కాయలు స్ఫటికం మాదిరిగా ముళ్లు ముళ్లుగా ఉంటాయి. ఈ కాయలలోని గుజ్జును ఏదో ఒక రూపంలో తీసుకుంటే మూత్రపిండాల్లో పేరుకున్న రాళ్లు కరుగుతాయి.
- పల్లేరు ఆకులు, కాయలు, వేర్లను ఎండబెట్టి... పొడి చేసి దాన్ని కూరల్లో వాడుకుంటే రకరకాల ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

మనలో చాలామంది తాటి ముంజలను ఇష్టంగా తింటూ ఉంటారు. వీటితో రకరకాల వంటలు కూడా చేసుకోవచ్చు. తాటి ముంజలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...



తాటి ముంజలతో మురిపించే రుచులు

తాటి ముంజలతో లెమనేడ్

కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, నిమ్మరసం- రెండు చెంచాలు, పంచదార- మూడు చెంచాలు, ఐస్ క్యూబ్స్- 4, ఉప్పు- చిటికెడు, నల్ల ఉప్పు- చిటికెడు, నీళ్లలో నానబెట్టిన సబ్జాగింజలు- రెండు చెంచాలు, పుదీనా ఆకులు రెండు

జాగ్రత్తలు

- లేత తాటి ముంజలు తీసుకుంటే ఈ పానీయం మరింత రుచిగా ఉంటుంది.
- ఇందులో నానబెట్టిన చియా గింజలు కూడా వేసుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలను చిన్న ముక్కలుగా తరగాలి.
- మిక్సీలో తాటి ముంజల ముక్కల్లో సగం, నిమ్మరసం, పంచదార, రెండు ఐస్ క్యూబ్‌లు, ఉప్పు, నల్ల ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి.
- ఒక సర్వింగ్ గ్లాస్‌లో సబ్జా గింజలు, మిగిలిన తాటి ముంజల ముక్కలు, రెండు ఐస్ క్యూబ్‌లు, మిక్సీ గిన్నెలోని మిశ్రమం వేయాలి. ఒక గ్లాసు చల్లని నీళ్లు పోయాలి. పైన పుదీనా ఆకులు వేసి సర్వ్ చేయాలి.

వీటిలో నీరు అధికంగా ఉంటుంది కాబట్టి శరీరానికి తగినంత తేమ అందుతుంది. నిర్జలీకరణ సమస్యలు రావు. తాటి ముంజలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



తాటి ముంజల పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, పంచదార- ముప్పావు కప్పు, లేత తాటి ముంజలు- ఆరు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- రెండు చెంచాలు, జీడి పప్పు పలుకులు- రెండు చెంచాలు, గులాబీ నీరు- ఒక చెంచా

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి వీలైనంత సన్నగా తరగాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి పెద్ద మంట మీద పావుగంటసేపు మరిగించాలి. పాలను గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా అయ్యాక పంచదార పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పాలను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచాలి. తరవాత ఈ చల్లటి పాలలో తాటి ముంజల తరుగు, గులాబీ నీళ్లు, బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. తరవాత చిన్న పింగాణీ గిన్నెల్లో పోసి సర్వ్ చేయడమే. ఈ పాయసం రుచి అద్భుతంగా ఉంటుంది.



జాగ్రత్తలు

- పాయసం చిక్కగా ఉండాలనుకుంటే... చిన్న గిన్నెలో ఒక చెంచా కస్టర్డ్ పౌడర్ వేసి, కొన్ని నీళ్లు పోయాలి. జారుగా కలిపి ఆ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో కలిపితే సరిపోతుంది.
- గులాబీ నీరు అందుబాటులో లేకపోతే నాలుగు రేకుల కుంకుమ పువ్వు వేసుకోవచ్చు.
- పంచదార వద్దనుకుంటే... మరిగిన పాలను స్టవ్ మీద నుంచి దించాక అందులో బెల్లం పొడి కలుపుకోవచ్చు.

తాటి ముంజలలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటు, మలబద్ధకం లాంటి సమస్యలను నివారిస్తాయి. శరీరంలో కణితులు, రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ముఖం మీద మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా చేస్తాయి.

తాటి ముంజల కూర



కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, జీలకర్ర- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- పావు కప్పు, నూనె- మూడు చెంచాలు

జాగ్రత్తలు

- తాటి ముంజల్ని మరీ లేతగా, మరీ ముదురుగా కాకుండా మధ్యస్థంగా ఉండేవి తీసుకోవాలి.
- నూనె వేడెక్కిన వెంటనే కొన్ని జీడిపప్పు పలుకులు వేస్తే కూర కమ్మగా ఉంటుంది.
- టమాటా ముక్కలను వీలైనంత సన్నగా తరగాలి. లేదంటే టమాటా పేస్టు వాడుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి ఒక్కోదాన్ని నాలుగు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద కడాయి పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. తరవాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత తాటి ముంజల ముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత టమాటా ముక్కలు, ధనియాలపొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కడాయిని స్టవ్ మీద నుంచి దించి కూరను వేరే గిన్నెలోకి తీయాలి. ఈ తాటి ముంజల కూర... అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

ఎండాకాలంలో తాటి ముంజలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. వడదెబ్బ తగలదు. శరీరంలో పేరుకున్న విషపదార్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

మూతల రంగుల్లో మర్మం ఇదే..!



మనం సాధారణంగా బయటికి వెళ్లినప్పుడు లేదా ప్రయాణాల్లో దాహమనిపిస్తే వెంటనే వాటర్ బాటిల్ కొనుక్కుని నీళ్లు తాగేస్తూ ఉంటాం. ఈ బాటిళ్లకు పలు రంగుల మూతలు ఉండడాన్ని చాలామంది గమనించే ఉంటారు. ఈ రంగు మూతలు ఆ బాటిళ్లలోని నీటి గురించి తెలియజేస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

నీలం: మనకు తరచుగా లభ్యమయ్యే వాటర్ బాటిళ్లకు నీలం రంగు మూతలు ఉంటాయి. అంటే ఆ బాటిళ్లలోని నీటిని నదులు, చెరువులు లాంటి సహజ వనరుల నుంచి సేకరించి శుద్ధి చేశారని అర్థం. ఈ నీటిలో లవణాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే ఈ నీటిని 'మినరల్ వాటర్' అంటారు.

ఆకుపచ్చ: ఇవి కాస్త అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. పెద్ద సూపర్ మార్కెట్లలో, షాపింగ్ మాల్స్‌లో, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఇవి లభ్యమవుతాయి. ఆకుపచ్చ మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నది 'ఫ్లేవర్డ్ వాటర్' అని అర్థం. కొన్ని రకాల నేచురల్ ఫ్లేవర్స్‌ను స్వల్ప మోతాదులో కలపడం వల్ల ఈ నీరు ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.



నలుపు: నలుపు రంగు మూత ఉన్న వాటర్ బాటిల్స్ కూడా అరుదుగానే కనిపిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. వీటిని సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు కొంటూ ఉంటారు. నల్లని మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి... 'ఆల్కలైన్ కలిపిన నీళ్లు' అని అర్థం. ఈ నీళ్లు తాగితే కడుపులో ఆమ్లత్వం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్షార పదార్థాలు, మినరల్స్ కూడా కలుపుతారు.

తెలుపు: తెల్లని మూత ఉన్న వాటర్ బాటిల్స్ సాధారణంగా అన్ని చోట్లా దొరుకుతూనే ఉంటాయి. వీధి చివరన ఉండే చిన్న కొట్లు, కిరాణా షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, బస్టాండ్లలో ఇవి విరివిగా లభ్యమవుతూ ఉంటాయి. తెలుపు మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి 'బాగా శుద్ధి చేసిన నీళ్లు' అని అర్థం. వీటిలో ఎటువంటి మినరల్స్ ఉండవు. కేవలం దాహం తీర్చుకోవడానికి పనికొస్తాయి.

పసుపు, ఎరుపు, గులాబీ రంగులు: పసుపు రంగు మూత ఉంటే ఆ నీళ్ల విటమిన్లు, ఎలక్ట్రొలైట్లు కలిపినవనీ; ఎరుపు రంగు మూత ఉంటే అవి కార్బొనేటెడ్ నీళ్లు అనీ తెలుసుకోవచ్చు. గులాబీ రంగు మూత ఉంటే అది నీటిని గురించి తెలియజేసేది కాదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినది.

మేకప్

మదర్స్ డే మేకప్

మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేకప్‌తో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిని గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజితోనే అద్దుకోవాలి.



తులసి ప్రయోజనాలెన్నో!

తులసి మొక్కను మనం పవిత్రంగా భావిస్తాం. దానిని అనునిత్యం పూజిస్తాం. అలాంటి తులసిలో విటమిన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు తాంటివి పుష్కలంగా ఉంటాయి. అందుకే తులసి ఆకులను తినడం, తులసి కషాయం, తులసి టీ తాగడం... ఇలా ఏదో ఒక రూపంలో తులసిని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం.



- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- తులసి కషాయం తాగడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

సెలబ్ ఫిట్

నవయవ్వన సోయగం

తారాజువ్వలా వెండితెర మీదకు దూసుకువచ్చింది. సల్మాన్ లాంటి స్టార్ల సరసన అందంగా ఒదిగిపోయింది. నవయవ్వన కాంతితో యువతరం హృదయ స్పందనై వెలిగింది. పరిశ్రమలోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా... నేటికీ అదే మైమరిపించే రూపు... చూపు తిప్పుకోనివ్వని నాజూకు... జాక్వెలిన్ ఫెర్నాండెజ్.



స్వదేశం శ్రీలంక. పుట్టింది బహ్రైన్‌లో. డిగ్రీ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో. ఆమె తండ్రి ఎల్రాయ్ ఫెర్నాండెజ్‌ది శ్రీలంక. తల్లి కిమ్‌ది మలేషియా, కెనడా మూలాలున్న కుటుంబం. శ్రీలంకలో సింహళీస్, తమిళుల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో జాక్వెలిన్ తండ్రి దేశం వదిలి బహ్రైన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తున్న కిమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన జాక్వెలిన్‌కు అక్క, ఇద్దరు అన్నలు. సిడ్నీ వర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన ఆమె... కొంత కాలం టీవీ రిపోర్టర్‌గా పని చేసింది. గ్లామర్ ప్రపంచంలోకి రావాలన్న ఆసక్తితో మోడలింగ్ మొదలుపెట్టింది. 2006లో 'మిస్ యూనివర్స్ శ్రీలంక' కిరీటాన్ని దక్కించుకుని, తన దేశం నుంచి 'మిస్ యూనివర్స్'కు పోటీపడింది.

అలా వచ్చి...

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది జాక్వెలిన్.

- తెల్లవారుజామును ఐదు గంటలకే జాక్వెలిన్ దినచర్య మొదలవుతుంది.
- ఉదయం లేవగానే తేనె, నిమ్మ రసం కలిపిన గ్లాసుడు గోరువెచ్చని నీరు
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, గ్రీన్ టీ.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతో బ్రౌన్ రైస్, వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్‌లు. వీటితోపాటు పిండి, పీచు పదార్థాలు, పోషక విలువలు పుష్కలంగా ఉండే క్వినోవా ఆమె మెనూలో తప్పనిసరి.
- అలాగే సలాడ్‌లు, వంటల్లో రెడ్, యల్లో క్యాప్సికమ్, చిలకడదుంపలు చేరతాయి.
- ఇంటర్మిటెన్ ఫాస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. తీపి పదార్థాలకు దూరంగా ఉంటుంది.
- రాత్రిపూట తేలికపాటి భోజనం. సాధ్యమైనంతవరకు రాత్రి ఏడు గంటలకల్లా డిన్నర్ ముగిస్తుంది.



ఆదివారమూ విరామం లేదు...

ఇతర తారలకు భిన్నంగా... జాక్వెలిన్ రోజూ కంటే ఆదివారం వ్యాయామాల కోసం మరింత ఎక్కువ సమయం కేటాయిస్తుందిట. "యోగా, వెయిట్ ట్రైనింగ్, డ్యాన్స్‌లు కలగలిపి ఆదివారం నా వర్కవుట్ రెండు నుంచి మూడు గంటలపాటు తీవ్రంగా సాగుతుంది. కొంతమంది అంటుంటారు... 'నాక్కూడా నీలాంటి దృఢమైన ఆకృతి కావాల'ని. ఇది ఒక్క రోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా ఇదే రూపాన్ని కాపాడుకొంటూ వస్తున్నా. క్రమం తప్పని ఆహార నియమాలు పాటిస్తున్నా. నా రూపు అథ్లెట్లను తలపించాలని కోరుకొంటాను. ఎప్పుడూ దృఢంగా, ఉల్లాసంగా, చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తాను. అవసరమైనప్పుడు కావల్సినంత విశ్రాంతి తీసుకొంటాను" అంటున్న ఈ ముద్దుగుమ్మ తరచూ తన ఫిట్‌నెస్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, అభిమానులకు ప్రేరణ కలిగిస్తుంటుంది. ఇన్‌స్టాలో ఏడు కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారంటే ఆమె క్రేజ్ ఏస్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

- జాక్వెలిన్ వ్యాయామాల్లో ప్రధానంగా యోగ ఉంటుంది.
- ఉదయం లేవగానే జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో తరువాత యోగా, పిలెట్స్, స్ట్రెంత్ ట్రైనింగ్
- రోజూ ఒకటే రకం వర్కవుట్స్‌తో ఆసక్తి తగ్గుతుంది. అందుకని తనను తాను ఉత్సాహపరుచుకోవడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొంటుంది.
- వ్యాయామాలను ఉత్సాహభరితంగా మార్చేందుకు పోల్‌డ్యాన్స్, ఏరియల్ సిల్క్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. పోల్ డ్యాన్స్ తనలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపిందో, శరీరాన్ని మరింత దృఢంగా ఎలా మార్చిందో వివరిస్తూ ఆ మధ్య ఇన్‌స్టాలో ఒకపోస్టు పెట్టింది జాక్వెలిన్.

కాకర చేదు తగ్గాలంటే!

కాకరకాయలో ఎన్నో పోషకగుణాలు ఉన్నాయి. కానీ చేదుగా ఉంటుందని చాలామంది దానితో చేసే వంటలను ఇష్టపడరు. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించి కాకరకాయ చేదును తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- కాకరకాయపైన ఉండే గరుకు భాగాన్ని తొలగించేయాలి. దీని వల్ల సగం చేదు తగ్గుతుంది.
- కాకరకాయ ముక్కలకు ఉప్పు రాసి 20-30 నిమిషాల ఉంచి తరువాత ఆ ముక్కలను నీళ్లతో మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దీని వల్ల చేదు కూడా తగ్గుతుంది.
- వేడి నీటిలో ఉప్పు వేసి అందులో కాకరముక్కలను నానబెట్టినా చేదును తగ్గించవచ్చు.
- కాకరకాయలో విత్తనాలు తీసివేయడం వల్ల కూడా చేదు తగ్గుతుంది.
- కాకర ముక్కలకు పెరుగు రాసి గంటసేపు పక్కన పెడితే చేదు చాలావరకూ తగ్గిపోతుంది.

డిఎస్సీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నరసరావుపేట కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ - 2025 పరీక్షలకు అర్హులైన పల్నాడు జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి బి.శివనాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు అర్హులని, ఎంపిక మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9441630075 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చిలకలూరిపేటలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష

చిలకలూరిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కోసం మునిసిపల్ బడ్జెట్‌లో అత్యధికంగా నిధులు కేటాయించి వెచ్చిస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు ఎందుకు రావటం లేదని మున్సిపల్ చైర్మన్ రఫాని శుక్రవారం ప్రశ్నించారు. పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్మన్ రఫానీ మాట్లాడుతూ దిగజారిన పారిశుధ్యంపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు, కౌన్సిలర్లకు, తమకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి కోరారన్నారు. పారిశుధ్య విభాగంలో అసలు ఏం జరుగుతున్నదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా భారీమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. క్షేత్రస్థాయి నుంచి శానిటరీ ఇనస్పెక్టర్లు, మేస్త్రులు శ్రద్ధ వహించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమణరావు, సునీత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ, మర్రిచెట్టుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో రెండో శనివారం సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు. మూడోఫేజ్ కరెంటు శనివారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి ఉదయం 9గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

బొల్లాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెంగుంటలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామివారికి ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ ఏ బాలకృష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, గోనుగుంట్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు ప్రోత్సాహకాలు: పీడీ సిద్ధ లింగమూర్తి

రొంపిచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి శుక్రవారం తెలిపారు. మండలంలోని తుంగపాడు, అన్నవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తుంగపాడులో ఏనుగంటి శ్రీనివాసరావు పండ్ల తోటను పరిశీలించారు. రూ.2.50లక్షల వ్యయంతో మామిడి మొక్కల సాగును రైతు చేపట్టారు. అనంతరం అన్నవరం గ్రామంలో సేద్యపు నీటి కుంట నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీవో ప్రసాదు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

నరసరావుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఎం.ఆనంద్ కుమార్‌కు చెన్నై సత్యభామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ప్రైవసీ ఆన్ బిగ్ డేటా అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ఘనంగా ఎం.ఆనంద్ కుమార్‌ను సన్మానించారు. ఎం.ఆనంద్ కుమార్‌ను ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు అవగాహన

రొంపిచర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, మునమాక, విప్పర్ల సెక్టార్ల పరిధిలోని సచివాలయాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కిశోర వికాస కార్యక్రమాన్ని కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల గురించి తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆషా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి, ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యం దిశగా ప్రభుత్వం నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తోందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. బొల్లాపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో 20లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామనే హామీ మేరకు సీఎం చంద్రబాబు పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారన్నారు. పారిశ్రామిక ప్రగతిలో సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భారీగా అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ముందుగా బొల్లాపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. 70 ఎకరాల్లో రూ.7కోట్లతో ఎంఎస్‌ఎంఈ పార్కు అభివృద్ధి కానుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 20లక్షల మందికి ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంలో భాగంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు నెలకొల్పుతున్నారని, మొదటి విడతగా 1455 ఎకరాల్లో రూ.590కోట్లతో ఎంఎస్‌ఎంఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు విద్యుత్ సహా పలు విభాగాల్లో మహిళలకు ప్రత్యేక రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు కల్పిస్తుందన్నారు. పల్నాడు ప్రాంతంలో అనేకమంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని, అలాంటి వారితో ముందుకువచ్చి ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటుచేస్తే అనుమతులు కూడా వేగంగా వస్తాయన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకే మంత్రి లోకేశ్ మరో అడుగు ముందుకు తీసుకు వెళ్లారని, రెండువేల మందికి ఉద్యోగ అవకాలు కల్పించేందుకే శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ లోకేశ్ భూమి పూజ చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పార్కులను నిర్లక్ష్యం చేసిందని, పరిశ్రమల విషయంలో వైసీపీకి ఒక విధానం అంటూ లేదని, అభివృద్ధి వ్యతిరేక పరిపాలన సాగించిందన్నారు. కొత్త పెట్టుబడులు రానివ్వలేదని, ఉన్న పరిశ్రమలు కూడా తరిమివేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు. స్థానికంగా చదువుకున్న యువతను ప్రోత్సహించి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో ఈ పార్కులను అభివృద్ధిచేసి ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకున్నామని, వారికి ఎలాంటి షూరిటీ లేకుండా కోటి రూపాయల వరకు రాయితీ రుణాలు ఇస్తోందని, ఈ అవకాశాన్ని మహిళా పారిశ్రామికవేత్తలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటులో గత ప్రభుత్వం తెచ్చిన అర్థం లేని నిబంధనలు తొలగించి సులభంగా అనుమతులు ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎంఎల్ నరసింహారావు, జిల్లా జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తహసీల్దార్ ఏ సుధాకర్, ఎంపీడీవో పీ సీతారామయ్య, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం: ఎంపీ

వినుకొండ, బొల్లాపల్లి మే 9 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కాలనీలో సుమారు రూ.2.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న కస్తూర్బా గాంధీ బాలికల వసతి భవనానికి, బొల్లాపల్లి కస్తూర్బా గాంధీ బాలికల వసతి భవనంలో అదనపు తరగతి గదులు నిర్మించటానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ నూతన వసతి భవనం బాలికలకు సౌకర్యవంతమైన విద్యను అందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ బాలికల విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని, ఈ భవనం బాలికల భవిష్యత్తుకు పునాది అన్నారు. గత ప్రభుత్వం హయాంలో విద్యను గాలికి వదిలేశారని, కూటమి ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో విద్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో మొత్తం 24 పాఠశాలలు పనిచేయడం రికార్డు అన్నారు. గతంలో 10 తరగతి వరకు ఉండే కేజీబీలు, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌ను చేర్చడం జరిగిందని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని తెలిపారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, ఆరికట్ల వాసుదేవరెడ్డి, గోవిందునాయక్, వెలిశెట్టి రంగయ్య, కాసరగడ్డ గోవిందరాజులు, అర్థలపూడి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొల్లాపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, చీఫ్ విప్ జీవీ, జిల్లా జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన తదితరులు

తాగునీటి వృథాను అరికట్టండి

● అధికారులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆదేశం



ప్రజావేదికలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే9 (ఆంధ్రజ్యోతి): తాగు నీటి వృథాను అరికట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కూటమి పార్టీల నాయకులతో కలిసి ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి తమ తమ సమస్యలను తెలిపారు. ప్రతిపాటికి పలువురు స్వయంగా అర్జీలు అందచేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో గతంలో తాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్యలు చాలావరకు పరిష్కారమయ్యాయని సంతృప్తి వ్యక్తంచేసిన ప్రత్తిపాటి, నీటివృథాను అరికట్టాలని ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బందిని ఆదేశించారు. మద్దినగర్ వాసులు నీటి సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ప్రత్తిపాటి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కొన్నివార్డుల్లో బోర్లు వేయాలని ప్రజలు కోరారని, బోర్ల ఏర్పాటుపై మున్సిపల్ సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద తమ 10 సెంట్ల స్థలాన్ని మాజీమంత్రి విడదల రజిని బంధువులు ఆక్రమించారని, సమస్య పరిష్కరించి తమకు న్యాయం చేయాలంటూ స్థల యజమానులు ప్రత్తిపాటిని కోరారు. సమస్య వివరాలు తెలుసుకున్న ప్రత్తిపాటి, బాధితులతో మాట్లాడి వారికి వెంటనే న్యాయం చేయాలని, ఆక్రమణదారులపై చట్టప్రకారం తగినచర్యలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. తమగ్రామంలో నిర్మించే నూతన దేవాలయాలకు ప్రభుత్వం నుంచి కామన్ గుడ్ ఫండ్ నిధులు అందించాలని యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామస్థులు ప్రత్తిపాటిని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన మాజీమంత్రి, దేవదాయశాఖ మంత్రితో మాట్లాడి నిధులు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని, సమస్య పరిష్కారానికి అవసరమైతే లోతుగా విచారణ జరిపి, అరు లైన వారికి న్యాయం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం, పింఛన్ల దరఖాస్తుల్ని పరిశీలించి, అరు లైన వారికి న్యాయం చేయాలని ప్రత్తిపాటి సూచించారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పించి, నీటి వసతి ఉన్న భూముల్లో అపరాలు, కూరగాయల సాగుని ప్రోత్సహించాలన్నారు. ప్రజలిచ్చే అర్జీల విషయంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ప్రత్తిపాటి హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రమేష్ జనసేన నేత తోట రాజారమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, జవ్వాజి మదన్ మోహన్, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినుకొండ నియోజకవర్గ సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యే సమీక్ష

వినుకొండ,టౌన్ మే 9: (ఆంధ్రజ్యోతి) వినుకొండ నియోజకవర్గంలో సమస్యలపై పట్టణంలోని తిమ్మాయిపాలెం రోడ్డులోని వై.కన్వెన్షన్ హాల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో ఎంపీ, ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అటవీ శాఖ జిల్లా అధికారిణి కృష్ణ చైతన్య వినుకొండ నియోక వర్గంలో అటవీ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న రోడ్ల నిర్మాణం, ఏదురవుతున్న సమస్యలను ఆమె తెలిపారు. త్వరలో కొప్పు కొండ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల నిర్మాణంపై నివేదిక అందిన వెంటనే నిర్మాణ పనులకు అనుమతులు అందచేస్తామన్నారు. అనంతరం విద్యుత్, ఉపాధి హామీ, వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు వినుకొండలో చేపట్టనున్న పలు అభివృద్ధి పథకాలపై నివేదికలను అందచేశారు. అనంతరం జీవీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి విద్యుత్ ఆదా కావాలంటే సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలని, రానున్న రోజుల్లో సోలార్ ప్యానళ్ల ఏర్పాటుతో ప్రభుత్వానికి విద్యుత్ విక్రయిచడం ద్వారా విద్యుత్ వినియోగంతో పాటు, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలో 25 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన సిమెంట్, ఇనుప స్తంభాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త స్తంభాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ ఎస్‌సీ నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పెండింగ్ వేతనాలు, 2024-25 సంవత్సరం పెండింగ్ నిధులు వచ్చేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కేంద్రం అందించే సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, సబ్సిడీ రుణాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీడీసీసీ బాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్, ఆర్‌డీవో మధులత, వినుకొండ తహసీల్దార్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, జీడీసీసీ బాంక్ చైర్మన్ మక్కెన, కలెక్టర్ అరుణ్ బాబు

దాణాపై సబ్సిడీని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బొల్లాపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. శుక్రవారం బొల్లాపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 50శాతం సబ్సిడీపై రెండు టన్నుల పశువుల దాణాను ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, జిల్లా పశు వైద్యశాఖ అధికారి డాక్టర్ కే కాంతారావుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 40 మంది లబ్దిదారులకు 50 శాతం సబ్సిడీ పై పశు దాణాను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాగశ్రీను, పశు వైద్య సహాయ సంచాకులు డాక్టర్ పీ శ్రీనివాస మూర్తి, సాల్మన్‌సింగ్, పశు పోషకులు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

వినుకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): వినుకొండ న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో మాక్స్ విజన్ డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి నరసరావుపేట వారి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం, కోనాక్ డయాగ్నోసిస్ ఆధ్వర్యంలో డయాబెటీస్ ఆరోగ్య పరీక్ష కేంద్రంను శుక్రవారం వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం. మహతి ప్రారంభించారు. ఈ కంటి వైద్యశిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి రాయితీపై కళ్లజోళ్లు మందులు ఇవ్వడం జరిగిందని, డయాబెటిక్ ఆరోగ్య పరీక్ష కేంద్రంలో రక్తపరీక్షలు ఉచితంగా చేశారని తెలిపారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు అందరికి కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పఠాన్ గౌస్‌మొహిద్దీన్, జాయింట్ సెక్రటరీ నీలం శేఖర్‌బాబు, ట్రెజరర్ వరగాని శివశంకర్‌బాబు, జి.వెంకటేశ్వర్లు, కె.చెన్నకేశవరెడ్డి, కెఎస్ఎన్‌వీ నాయుడు, ఎన్.రమణారావు, వి.అమర్‌బాబు, డి.నాగరాజు, ఎం. మల్లికార్జున్‌రెడ్డి, ఎన్. రామాంజనేయరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి ఎం.మహతి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

ప్రజలు పోలీసులకు సహకరించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశం, పాకిస్థాన్ మధ్యలో యుద్ధ వాతావరణం ఉన్న తరుణంలో రాష్ట్ర ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు 140 అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం నియోజవర్గం టీడీపీ కార్యాలయంలో ప్రజలు సమస్యలు తెలుసుకోవటానికి ప్రజావేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతి పత్రాలు వస్తున్నాయని అన్నారు. వచ్చే నెల నుంచి కొత్త పెన్షన్, రేషన్ కార్డులు అందిస్తామని చెప్పారు. రైతులకు రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తామని, స్కూలుకు వేళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.15వేలు అందిస్తామన్నారు. ఇంటి స్థలం లేనివారికి ఇంటి స్థలం అందించి పక్కా గృహాలు కట్టిస్తామని, ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ఎమ్మెల్యేతో కలసి ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు.

పెట్లూరివారిపాలెంలో బస్సు షెల్టర్ ప్రారంభం

నరసరావుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్లూరివారిపాలెంలో మండవ వెంకట కోటమ్మ జ్ఞాపకార్థం బస్సు షెల్టర్ ఏర్పాటుచేశారు. బసు షెల్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

నరసరావుపేట లీగల్, మే 9 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, నేతృత్వంలో గురువారం రాత్రి జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు రాత్రి 9.00గంటల నుంచి 11.00 గంటల వరకు జరిగిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో జిల్లా అంతటా ముమ్మరంగా వాహనాల తనిఖీలు, లాడ్జీల తనిఖీలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల గుర్తింపు తదితర అంశాలపై తనిఖీ నిర్వహించారు. ఎస్పీ స్వయంగా స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతను మెరుగుపరిచేలా, నేరాల నియంత్రణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడేలా ఈ తనిఖీలు చేశామన్నారు. లాడ్జీలలో నిర్ధారణ లేకుండా బసచేస్తున్న వారిని, రిజిస్ట్రేషన్ లేకుండా గదులు కేటాయించే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక శక్తులు దాగిఉండే అవకాశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.



నిరవధిక సమ్మెలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

'సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలి'

నరసరావుపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీ పార్కు వద్ద 12వ రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఎన్‌ఎంహెచ్‌లోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల జీతంలో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి ఏడాది ఐదు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను తీర్చేలా హామీ ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు కొనగిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు ఎం.అనుపమ్మ, సాగర్, రాము, మస్తాన్, వినోద్, ఏఐటీయూసీ నాయకుడు ఉప్పలపాటి రంగయ్య పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్ వాడీలు తదితరులు

బాల్య వివాహాలతో శిశు, మాతృ మరణాలు

● జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రశాంత్

నాదెండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో శిశు, మాతృ మరణాలు సంభవిస్తాయని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి వై.ప్రశాంత్ అన్నారు. మండలంలోని సాతులూరులోని బీసీ కాలనీల్లో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిశోరి బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయటం వల్ల త్వరగా గర్భం దాల్చటం, ఎనీమియా బారినపడటం జరుగుతుందన్నారు. నెలలు నిండకుండా ప్రసవాలు, అంగవైకల్యం, బుద్ధి మాద్యంతో పుట్టడం లాంటివి జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రతి ఒక్కరికి వివరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే.పద్మ, షేక్ అఖిల, పావని, రాజేశ్వరి, విజయలక్ష్మి, కల్పన, కుమారి, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇరుక్కుపోయిన ఆవు.. కాపాడిన గ్రామస్థులు

ఈపూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరులో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన ఆలయం గోడకు పక్కనే ఉన్న ఇంటి గోడకు మధ్యలో ఉన్న సందులోకి వెళ్ళి ఆవు ఇరుక్కు పోయింది. ఆవు బయటకు వచ్చేందుకు అరుస్తుండటంతో సమీపంలోని వారు ఆవును బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అది వీలుపడకపోవటంతో ఆలయం ప్రహరీ పగలగొట్టి ఆవును రక్షించారు.



రెండు గోడల మధ్య ఇరుక్కుపోయిన ఆవు